

కార్యకర్తలకు పార్టీ అండ

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. మార్కాపురంలో ఆయన మాట్లాడారు.

- 8లో..



వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక

టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 200 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

గురువారం - ఇఫ్తార్ : సా॥ 6.26
శుక్రవారం - సహరీ : ఉ॥ 4.52



న్యూస్‌రీల్

ఆంగ్ల పరీక్షకు 464 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి ఆంగ్ల పరీక్షకు 464 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 29392 మంది విద్యార్థులకుగాను 28968 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదిలిలోని నిర్మల హైస్కూల్, ఆల్ఫా హైస్కూల్, గొట్లగట్టులోని జెడ్పీహెచ్ఎస్, పిటి కాయగుళ్లలోని జెడ్పీహెచ్ఎస్‌లను పరీక్షల పరిశీలకులు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర ముండ్లమూరు జెడ్పీహెచ్ఎస్, కురిచేడు ఏపీఏస్‌డబ్ల్యూఆర్ఎస్ (బాలురు), త్రిపురాంతకంలోని జెడ్పీహెచ్ఎస్‌లోని రెండు సెంటర్లను, మేడపి జెడ్పీ ఉన్నత పాఠశాల సెంటర్‌ను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 107 సెంటర్లను తనిఖీ చేశాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 550 మంది గైర్హాజరు:

ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లాలోని 34 సెంటర్లలో 550 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎస్ఎస్‌సీ ఆంగ్ల పరీక్షకు 1489 మంది హాజరుకావాల్సి ఉండగా 1322 మంది హాజరయ్యారు. ఇక ఇంటర్ పరీక్షలకు 4733 మందికిగాను 383 మంది మాత్రమే హాజరయ్యారని డీఈవో డి.సుభద్ర పేర్కొన్నారు.

మెడికల్ సూపరింటెండెంట్‌గా సావిత్రి



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సావిత్రి

మార్కాపురం టౌన్: మార్కాపురం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సావిత్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గుంటూరు వైద్య కళాశాలలో అనాటమీ హెచ్ఓడీగా పనిచేస్తూ పదోన్నతిపై మార్కాపురం జీజీహెచ్‌కు సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. మొదట పెద్దదోర్నాల పీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేశారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో సివిల్ సర్జన్‌గా పనిచేస్తూ గుంటూరు వెళ్లి అక్కడి నుంచి పదోన్నతిపై మార్కాపురం జీజీహెచ్‌కు వచ్చారు.

కంప్యూటర్ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: నిరుద్యోగ యువతీ యువకులను ఉన్నతి ఫౌండేషన్ ద్వారా పలు కంప్యూటర్ సైన్స్‌లో ఉద్యోగాల్లో స్థిరపడేందుకు వైఎస్సార్ కడప జిల్లాలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరి ప్రసాద్ తెలిపారు. 35 రోజుల శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని చెప్పారు. పదో తరగతి నుంచి బీటెక్ వరకు చదివిన వారికి తగిన ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తారన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ కమ్యూనికేషన్, లైవ్ ఇంటర్‌వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. పూర్తి వివరాలకు 9000487423లను సంప్రదించాలని కోరారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో క్విస్ విద్యార్థిని ప్రతిభ

ఒంగోలు సెంట్రల్: స్థానిక క్విస్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థిని భార్గవి ఢిల్లీలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఈఈఈ హెచ్ఓడీ డాక్టర్ మౌళి చంద్ర, తదితరులు విద్యార్థినిని అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా తమ కళాశాల ప్రోత్సహిస్తుందని వక్తలు అన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న చైర్మన్, లెక్చరర్లు

పొత్తు పొట్లు..!

సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని అన్ని స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించింది. ప్రతిపక్ష టీడీపీ కూటమి ఇంతవరకూ దర్శి స్థానానికి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ఇద్దరు అభ్యర్థులను మార్చగా, తెలుగుదేశం అనుకూల మీడియా రోజుకో పేరును ప్రచారంలోకి తెస్తూ ఆ పార్టీల కేడర్‌ను గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి.



- దర్శిలో కూటమి డైలామా
- అభ్యర్థిగా రోజుకో పేరు
- ఇప్పటికే తెరపైకి ఇద్దరు కృష్ణులు
- ఐవీఆర్ఎస్ సర్వేతో మరింత జాప్యం
- అభ్యర్థి ఎవరో తెలియక కేడర్‌లో అయోమయం

సాక్షి ప్రతినిధి,ఒంగోలు:

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలు ఉండగా ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసిన కూటమి పార్టీలు ఒక్క 'దర్శి' లో మాత్రమే అభ్యర్థిని ఖరారు చేయలేక ఆపసోపాలు పడుతున్నాయి. ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రచారంలో దూసుకుపోతుంటే.. ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మాత్రం ఇక్కడ అభ్యర్థిని ఎవరిని నియమించాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నాయి. ఒక వైపు ఐవీఆర్ఎస్ ద్వారా టీడీపీ రోజుకొక పేరును తెరపైకి తెస్తోంది. ఇంకో వైపు టీడీపీ అనుకూల మీడియా మరో మెట్టు ఎక్కి.. కొత్త కొత్త ముఖాల పేర్లు చెబుతూ కూటమి పార్టీల కేడర్ నే కాకుండా.. దర్శి ప్రజలను సైతం డైలామాలో పడేస్తున్నారు. వాస్తవంగా ఈ స్థానం నుంచి జనసేన నేతలు పోటీ చేయాలని భావించారు. అయితే ఇక్కడ నుంచి తామే పోటీ చేయాలా? జనసేనకు ఇవ్వాలా? అనే అంశాన్ని తేల్చుకోలేకపోతోంది టీడీపీ నాయకత్వం. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనా ఇంతవరకూ స్పష్టత రాకపోవడం గమనార్హం.

ఆది నుంచి ఇదే తంతు..

దర్శి నియోజకవర్గానికి సంబంధించి ఐదేళ్లుగా తెలుగుదేశం పార్టీలో గందరగోళం నెలకొని ఉంది. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన కదిరి బాబురావు ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పుడు మొదలైన సమస్య నేటికీ కొనసాగుతోంది. బాబురావు వెళ్లిపోయిన తర్వాత టీడీపీ అధిష్టానం స్థానిక నాయకులను కాదని ఒంగోలుకు చెందిన పమిడి రమేష్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించింది. ఆయన కొంత కాలం పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. పెద్దగా ప్రయోజనం కనిపించకపోవడంతో సైకిల్ దిగి వెళ్లిపోయారు. దాంతో ఏడాదిన్నర నుంచి దర్శి టీడీపీకి నాయకుడు లేకుండా పోయారు.

తెరపైకి జనసేన..

పమిడి పార్టీని వీడిన తర్వాత ఈ సీటుపై జనసేన నేతలు ఆశలు పెట్టుకున్నారు. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన ఎన్నారై గరికపాటి వెంకట్ దర్శికి వచ్చి పార్టీ కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. దీంతో కూటమి తరఫున ఈ సీటు జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతూ వచ్చింది. అయితే వెంకట్.. లోకేష్ సూచనల మేరకే ఇక్కడకు వచ్చి హడావుడి చేశారని ప్రచారం కూడా ఉంది. ఈ సీటును టీడీపీకి కేటాయిస్తారని ప్రచారం జరగడంతో కొద్ది రోజులుగా గరికపాటి వెంకట్ అదృశ్యమయ్యారు. గరికపాటి ఎక్కడా అంటే పార్టీ నేతల నుంచి సరైన సమాధానం రావడంలేదు. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉన్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. రెండు రోజులుగా ఆయన పేరు టీడీపీ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా బాచిన కృష్ణచైతన్యను ఇన్‌చార్జిగా టీడీపీ నియమించింది. అయితే జనసేన తరఫున టికెట్ ఇస్తామని, గ్లాసు గుర్తుపై పోటీ చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించినట్లు తెలిసింది. ఆయన దీనికి ససేమిరా అన్నట్లు తెలిసింది. బాచిన చీరాల సీటు అడుగుతున్న సమాచారం. ఇదిలా ఉండగా గొట్టిపాటి నర్సయ్య కుమార్తె లక్ష్మి పేరును పరిశీలించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆమె నర్సరావుపేటలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమె మామ డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు నరసరావుపేట సీటు ఆశించారు. నర్సరావుపేట ఇవ్వడం కుదరదని, జనసేనలో చేరితే దర్శిని నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తామని చంద్రబాబు చెప్పినట్టు తెలిసింది. దీనికి వారు తిరస్కరించారని సమాచారం. సుమారు పది రోజుల కిందట ఒక కళాశాల అధిపతి గోరంట్ల రవికుమార్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జిగా టీడీపీ నియమించింది. రెండు రోజుల క్రితం తెలుగు దేశం పార్టీ నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో గరికపాటి వెంకట్ పేరు ఉంది. ఇంతకూ గరికపాటిని టీడీపీ తరుపున బరిలోకి దించుతారా లేక జనసేన నుంచి పోటీ పెడతారా అనేది తెలియక కేడర్ తలలు పట్టుకుంటోంది.

మీడియాలో రోజుకో పేరు..

తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియా ఈ నియోజకవర్గం నుంచి ఫలానా వారు పోటీ చేస్తారంటూ రోజుకో కొత్త పేరును ప్రచారంలోకి తీసుకొస్తోంది. పాత కాపులెవరూ పార్టీలో లేకపోవడం, కొత్త నేతలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో తెలుగుదేశం పార్టీ గందరగోళంలో ఉంది. ఈ రోజు..రేపు అంటూ వాయిదాల పర్వం కొనసాగుతోంది. చివరి ప్రయత్నంగా టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఈ సర్వేలో గరికపాటి, గోరంట్ల వైపే మొగ్గు చూపినట్లు తెలిసింది. ఈ ఇద్దరిలో ఒకరికి పట్టం కట్టబెడతారో లేక కొత్త వారిని దిగుమతి చేస్తారో వేచి చూడాల్సిందే.

మందకృష్ణ మాదిగ ప్యాకేజీ స్టార్

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవప్రసాద్

దర్శి: ప్యాకేజీ కోసమే ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ టీడీపీ, జనసేన పార్టీలకు మద్దతు ఇస్తున్నారని ఆయన పవన్ కళ్యాణ్‌లా ఒక ప్యాకేజీ స్టార్ అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మందకృష్ణ మాదిగలను వంచన చేసిన చంద్రబాబుకు కొమ్ముకాయడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని, పెద్ద మాదిగను అవుతానని చంద్రబాబు చెప్పిన మాటలు మాదిగలు ఇంకా మరిచిపోలేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ వర్గీకరణపై ఏమాత్రం శ్రద్ధ చూపలేదని, ఇప్పుడు వర్గీకరణ చేస్తామంటే మాదిగలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కృష్ణ మాదిగ మాటలు నమ్మి మాదిగలు మోసపోవద్దని హితవు పలికారు. 1996 పార్లమెంట్ ఉప ఎన్నికల్లో కూడా కృష్ణ మాదిగ తెలుగుదేశం పార్టీకి బహిరంగంగా మద్దతు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో మాదిగలకు తీవ్రంగా అన్యాయం జరిగిందన్నారు. గత ఐదేళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు పెద్ద పీట వేశారని చెప్పారు. గతంలో చంద్రబాబు ఒక మంత్రి పదవితో మాదిగలకు సరిపెడితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలకమైన రెండు మంత్రి పదవులు మాదిగలకు ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఎన్నికల సమయంలోనే వర్గీకరణ అంశం కృష్ణ మాదిగకు గుర్తుకు రావడం విచారకరమన్నారు. వర్గీకరణపై కృష్ణ మాదిగకు చిత్తశుద్ధి లేదని చెప్పారు.

పొగాకు గరిష్ట ధర రూ.231

టంగుటూరు: రైతులు వేలానికి అనుగుణంగా నాణ్యమైన పొగాకు బేళ్లు తీసుకొచ్చి అధిక ధరలు పొందాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రం పరిధిలో బుధవారం చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 933 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 858 కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 75 తిరస్కరించారు. గరిష్ట ధర రూ.231, కనిష్ట ధర రూ.220, సరాసరి రూ.228.92 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 24 మంది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తా

- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

సింగరాయకొండ(మర్రిపూడి): కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. చెవిరెడ్డి మాట్లాడుతూ తాను విద్యావంతుడినని, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని.. రాబోయే ఎన్నికల్లో ఒంగోలు ఎంపీ సీటు, కొండపి అసెంబ్లీ సీటు రెండూ గెలిచేలా మీరందరూ సహకరించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. పార్టీకి విధేయులుగా ఉన్న ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని వారి సేవలను మరచిపోనని భరోసా ఇచ్చారు. పార్టీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు పార్లమెంటు అబ్జర్వర్ టీజేఆర్ సుధాకరబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్వామి అహంకారి అని.. నోటి దురుసు ఎక్కువని, అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పరుష పదజాలంతో విమర్శించిన వ్యక్తి అని అన్నారు. ఇటువంటి వ్యక్తిని సభ్యసమాజానికి దూరంగా ఉంచాలని, రాబోయే ఎన్నికల్లో కొండపిలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని, తాను ఎమ్మెల్యే గా గెలుపొందితే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ఉన్న తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రధాన సమస్యలైన సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తానని, దేవదాయ భూముల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుక్కా కిరణ్‌కుమార్, రాపూరి ప్రభావతి, భాగ్యమ్మ, అల్లాభక్షు, షేక్ కరీం, సయ్యద్ ఆబిద్ ఆలీ, దాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇస్త్రీ చేస్తూ.. ప్రజలతో మమేకమవుతున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన ఆదిమూలపు సురేష్



టీ దుకాణంలో చెవిరెడ్డి, ఆదిమూలపు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తనను రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండలో బుధవారం చెవిరెడ్డి, ఆదిమూలపు ఇద్దరూ పోటాపోటీగా తమదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రచార ర్యాలీ ఆర్టీసీ బస్టాండు మీదుగా సాగింది. ఈ సందర్భంగా చెవిరెడ్డి, సురేష్ ఇరువురూ ఆర్టీసీ బస్సు ఎక్కి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రయాణికులను అభ్యర్థించారు. తరువాత టీ దుకాణంలో టీ కలుపుతూ, ఇస్త్రీ షాపులో దుస్తులు ఇస్త్రీ చేస్తూ, కూల్‌డ్రింక్ షాపులో గ్లాసులో కూల్‌డ్రింక్ పోస్తూ దుకాణదారులతో మమేకమయ్యారు. పండ్ల దుకాణాలు, షాపుల వారితో మాటామంతీ కలుపుతూ తమను పరిచయం చేసుకుంటూ చెవిరెడ్డి, సురేష్ ఇద్దరూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పండ్ల వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న భాస్కరరెడ్డి, సురేష్



కార్యకర్తలతో మాట్లాడుతున్న చెవిరెడ్డి, పక్కన సురేష్, టీజేఆర్

ఊపందుకున్న మంత్రి మేరుగు ప్రచారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

- చీమకుర్తి రూరల్, అర్బన్‌లో ఇంటింటి సుడిగాలి పర్యటన
- సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

చీమకుర్తి: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున బుధవారం చీమకుర్తి రూరల్, అర్బన్‌లో సుడిగాలి పర్యటన చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రి నాగార్జున మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటని, ఇప్పటికి రెండు సార్లు వరుసగా గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుడు మూడోసారి కూడా సంతనూతలపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని స్థానిక ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను మరోసారి ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గత ఐదేళ్ల నుంచి అందించిన సంక్షేమ పథకాలను చూసి ఆయన్ను మళ్లీ సీఎం చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. తొలుత చీమకుర్తి రూరల్‌లోని పుట్టచెరువుపాలెం, బూసురపల్లి, చినరావిపాడు, పులికొండ, మైలవరం గ్రామాల్లో పర్యటించారు. రాత్రికి చీమకుర్తి మున్సిపాలిటీలోని 5, 6వ వార్డులలో పర్యటించి ఎన్నికల ప్రచారం కొనసాగించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్ పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మంత్రి మేరుగు నాగార్జున తనయుడు చందన్ నాగ్, వైస్ మున్సిపల్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, దాసరి లక్ష్మినారాయణ, జీ.ఓబుల్‌రెడ్డి, పాటిబండ్ల గంగయ్య, గోపురపు చంద్ర, స్థానిక గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చీమకుర్తి మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున

సువిధ పోర్టల్ ద్వారా అనుమతులు

- ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డి

ఒంగోలు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సువిధ పోర్టల్ ద్వారా తమ పార్టీకి కావాల్సిన అనుమతులు పొందాలని ఆర్డీఓ జీవీ సుబ్బారెడ్డి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సువిధ పోర్టల్ ద్వారా ముందస్తు అనుమతులను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ సెంటర్లలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే వాహనాలు, మైకులు, లౌడ్ స్పీకర్లు, బెలూన్లు, కరపత్రాలు, రోడ్డు షోలకు కూడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. సువిధలో వచ్చే ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈసీ ఆదేశాలను అన్నీ రాజకీయ పార్టీలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 16వ తేదిన ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నగరంలో ఫ్లెక్సీలు తొలగించామని, విగ్రహాలన్నిటికీ ముసుగులు వేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కింది స్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పోలింగ్ రోజు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యంతో పాటుగా షామియానాలు, వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రశాంతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని కోరారు. సమావేశంలో ఏట చిన్ని కృష్ణ, ఈడీఎం శ్రీకాంత్, డీటీ కట్టా శ్రీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్బారెడ్డి

27న ప్రపంచ రంగస్థల దినోత్సవం

ఒంగోలు మెట్రో: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు తెలిపారు. ఆ వివరాలతో కూడిన కరపత్రాన్ని బుధవారం ఉదయం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల కళల సమాహారం నాటకం అని, అటువంటి నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. నేటి సాంకేతిక యుగంలో పౌరాణిక నాటకరంగ బలోపేతానికి నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనుమాల రాఘవులు మాట్లాడుతూ 27వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు తమ సంస్థ ఆధ్వర్యంలో సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ కళా ప్రాంగణంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా చందు డ్యాన్స్ అకాడమీ వారిచే నృత్య ప్రదర్శనలు జరుగుతాయని, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భక్త చింతామణి (లవ్ సీన్) శ్రీ రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర (వారణాసి ఘట్టం) ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఆగమ వేద పండితుడు పరాంకుశం కేశవాచార్యులు, ఆత్మీయ అతిథులుగా నరసం గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, నాగభైరవ సాహితీపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ప్రరసం అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు బాబూరావు, వెంకటేశ్వర్లు, సింగయ్య, సత్యనారాయణ, ఆదిపూడి నరేంద్ర, గోదాసు సుబ్బారావు, పిల్లి నాగభూషణం పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి మొక్కలతో సెబ్ అధికారులు

యర్రగొండపాలెం: మండలంలోని గంగుపల్లి కంది పొలంలో పెంచుతున్న గంజాయి మొక్కలను సెబ్ అధికారులు బుధవారం దాడులు చేసి ధ్వంసం చేశారు. సెబ్ సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..ఎస్పీ పరమేశ్వర రెడ్డి, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగేశ్వరరావు ఆదేశాలపై గంగుపల్లి గ్రామానికి సమీపంలోని 359/2 సర్వేనంబరు పొలంలో కందిలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు గుర్తించామన్నారు. దాదాపు రూ.3 లక్షల విలువైన 282 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని, ఈ మొక్కలను ఆ గ్రామానికి చెందిన కె.బ్రహ్మయ్య పెంచుతున్నాడని, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. గంజాయి సాగుచేసినా, విక్రయించినా అక్రమంగా మద్యం నిల్వ ఉంచి అమ్మినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన

కొమరోలు: మండలంలోని రామావారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన పట్టాభి సీతారామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్లకు వరుసగా రూ.25 వేలు, రూ.22 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు 9959184494ను సంప్రదించాలని సూచించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పొదిలి రూరల్: మండలంలోని మాదాలవారిపాలెంలో బుధవారం ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నుగ్గు శ్రీనివాసులు పొగాకు క్యూరింగ్ చేస్తున్న సమయంలో నిప్పు రవ్వలు ఆకులపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బ్యారన్ మొత్తం వ్యాపించాయి. దర్శి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే బ్యారన్‌లోని పొగాకు, కర్ర, టైర్లు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదం కారణంగా రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతుఆవేదన వ్యక్తం చేశారు.

కష్టపడే కార్యకర్తలకు అండ



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాంబాబు, జంకె



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ కోసం జెండా మోసిన కార్యకర్తనని గర్వంగా చెప్పుకుంటా
- ఒంగోలు ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మార్కాపురం టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని, వారికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సెవెన్‌హిల్స్ ఫంక్షన్‌హాలులో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తగా గర్వంగా చెప్పుకునే మనస్తత్వం తనదని చెప్పారు. నిత్యం ప్రజల మధ్య ఉండటమే తన వ్యాపకమని, ఎటువంటి వ్యాపారాలు లేవన్నారు. ప్రజల కోసం పొదిలిలో నివాసం ఏర్పాటు చేసుకుని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. జిల్లా అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మూడు జిల్లాల నీటి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతోపాటు రెండు టన్నెళ్లను ప్రారంభించి జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పార్టీ కోసం జెండాలు కట్టే దగ్గర నుంచి జగనన్న ఎదుర్కొన్న కష్టాల సమయంలో దగ్గరుండి చూసిన వ్యక్తినని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తని తలెత్తుకునేలా చేస్తామన్నారు.

గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, ఇప్పుడు కూటమితో మరోసారి మభ్యపెట్టేందుకు బూటకపు హామీలతో ముందుకొస్తున్నారన్నారు. ఆయన మోసాలను ప్రతి ఇంటికీ తెలపాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని, మార్కాపురం ఎమ్మెల్యేగా నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని అర్థిస్తున్నానన్నారు. చెప్పిన మాటకు కట్టుబడే వ్యక్తిననీ, ప్రతి కార్యకర్త కోసం పనిచేస్తానన్నారు. రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, రాజకీయ ఉద్దండులు కేపీ కొండారెడ్డి, జంకె రామిరెడ్డి, సానికొమ్ము పిచ్చిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి కుటుంబాలతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు.

జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుని రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో సుమారు 132 పథకాలతో పేద, మధ్య తరగతి కుటుంబాలను లక్షాధికారులుగా చేసిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజే సుధాకర్ బాబు మాట్లాడుతూ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అడ్డాగా ఉందని, ప్రజలందరూ పార్టీకి అండగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ఢిల్లీ నుంచి కూటమిగా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల్లో ముందుకొస్తున్నారని ఆయనను నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. ప్రజలు జగనన్ననే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషేర్ అలీబేగ్, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యులు, వైపాలెం నియోజకవర్గ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ 1,2, షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మాజీ ఏఎంసీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మార్కాపురం, తర్లుపాడు ఎంపీపీలు బండి లక్ష్మీదేవీ, సూరెడ్డి భూలక్ష్మి, త్రిపురాంతకం ఎంపీపీ, జెడ్పీటీసీ కోట్ల సుబ్బారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



కేపీ కొండారెడ్డిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జంకె, అన్నా రాంబాబు, టీజేఆర్, చంద్రశేఖర్, వెన్నా

కేపీ కొండారెడ్డికి చెవిరెడ్డి పరామర్శ

మార్కాపురం: మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేపీ కొండారెడ్డిని బుధవారం సాయంత్రం ఆ పార్టీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కేపీ కొండారెడ్డి చికిత్స అనంతరం మార్కాపురంలోని చెన్నకేశవనగర్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను పరామర్శించి, తనయుడు కృష్ణమోహన్‌రెడ్డిని అడిగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. చెవిరెడ్డి వెంట ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, టీజేఆర్ సుధాకర్‌బాబు, ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, వైపాలెం నియోజకవర్గ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఉత్తమకుమార్, సతీష్, కరీంబాషా తదితరులు ఉన్నారు.

ఓటమి భయంతోనే చవకబారు విమర్శలు

- వ్యక్తిగత విభేదాలతోనే మునెయ్యపై దాడి
- అందులో రాజకీయాలకు తావెక్కడిది?
- అడ్డగోలుగా విమర్శలు చేస్తే సహించేది లేదు
- టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డిపై వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం గడికోట పంచాయతీ పరమేశ్వరనగర్‌కు చెందిన పాముల మునెయ్య అనే వ్యక్తి హత్యను రాజకీయం చేయడం టీడీపీ దివాళాకోరు రాజకీయానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం గిద్దలూరు పట్టణంలోని ఒంగోలు రోడ్డులో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునెయ్య, అతనిపై దాడి చేసిన అల్లూరయ్య సమీప బంధువులని, వారి మధ్య వ్యక్తిగత విభేదాలతోనే హత్య జరిగిందని స్పష్టం చేశారు. అయితే టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాజకీయ హత్య అని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. అశోక్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్ సీపీపై స్థాయి మరిచి విమర్శలు చేయడం మానుకుంటే మంచిదని హితవు పలికారు. ప్రజాగళానికి అత్యధిక జనాన్ని తరలించినందుకే మునెయ్యను చంపారనడంలో లేశమంతైనా నిజం ఉందో లేదో ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ లబ్ధి పొందేందుకు టీడీపీ నేతలు అసత్యాలు వల్లెవేసి, వాటిని టీడీపీ అనుకూల పత్రికల్లో అచ్చు వేయించారని మండిపడ్డారు. ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు చవకబారు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పులి రామకృష్ణారెడ్డి, ఓబులరావు, ఎగ్గనపల్లె నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, ఎదురు శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, ఎంపీటీసీ పిడుగు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక

కనిగిరి రూరల్: టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 200 మంది యువకులు పార్టీ యూత్ నాయకుడు ఎస్‌కే లాలు, బాజీల ఆధ్వర్యంలో బుధవారం పార్టీ నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో దద్దాల నారాయణ యువకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే యువతకు అత్యధిక ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వార సుమారు 4లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. రాజకీయంలో యువతకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. తనను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి వైస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని పిలుపు నిచ్చారు. తొలుత యూత్ దుద్దుకూరి నాగేంద్ర, లోతు సాయి, నవదీప్, రాజశేఖర్ రెడ్డి, మంచుకంటి, లోకనాథ్‌రెడ్డి, దాసరి విల్సన్, కొదమల విజయ్, కల్వకుంట విగ్నేశ్వర్‌రెడ్డి, కేతిరెడ్డి కార్తీక్, గోనా లీలా బాబు, నేలపాటి డేవిడ్, నేలపాటి దయాకర్, జకరయ్య, మల్లేష్, కిషోర్, నేలపాటి సామ్రాట్, అశోక్, జయసూర్య, కొదమల వినోద్, మనోజ్, అర్జున్, నాగరాజు, నారాయణ లతో పాటు మరికొందరికి దద్దాల నారాయణ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, పార్టీ యూత్ అధ్యక్షుడు రసూల్, సిరుప గోవర్ధన్‌రెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



దద్దాల నారాయణ సమక్షంలో పార్టీలో చేరిన యువత

భార్యను కడతేర్చిన భర్త

చీరాల టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో కట్టుకున్న భార్యను భర్తే గొంతు నులిమి చంపి పొలాల్లో పడేశాడు. ఈ ఘటన బుధవారం చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోశయ్య కాలనీలో చోటు చేసుకుంది. దేవర లక్ష్మీనారాయణకు పదిహేనేళ్ల క్రితం లక్ష్మి(36)తో వివాహం జరిగింది. వీరి కాపురంలో కలతలు రేగాయి. బుధవారం వీరి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన లక్ష్మీనారాయణ రెండు చున్నీలను తన భార్య మెడకు బిగించి హత్య చేశాడు.

మహిళాభ్యున్నతే రాష్ట్రాభివృద్ధి

- గ్రామ స్వరాజ్యంతో అభివృద్ధి సాధించవచ్చని నమ్మిన వ్యక్తి జగన్
- విద్య, వైద్యానికి సీఎం జగనన్న పాలనలోనే పెద్దపీట
- మన ఊరు–మన శివన్న కార్యక్రమంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శివప్రసాద్‌రెడ్డి దంపతులు

కురిచేడు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని నమ్మి ప్రతి పథకంలో వారికి ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మన ఊరు–మన శివన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని పడమరగంగవరం, రెడ్డెన్నపల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి ఆయన జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి స్థానిక నాయకులు, మహిళలు హారతులిచ్చి, గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్యానికి జగనన్న పెద్ద పీట వేశారని, పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు విదేశీ విద్య అభ్యసించేందుకు కృషి చేశారని కొనియాడారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారని దుయ్యబట్టారు. బాబు ఎగ్గొట్టిన రూ.25 వేల కోట్లను సీఎం వైఎస్ జగన్ నాలుగు విడతల్లో మహిళలకు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు మరింత మేలు చేసేందుకు వైఎస్సార్ సీపీని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో దర్శి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ అన్నెం అరుణ, ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వరికూటి వెంకటేశ్వర్లు, కురిచేడు మాజీ సొసైటీ ప్రెసిడెంట్లు గోగులమూడి లింగారెడ్డి, మేరువ పిచ్చిరెడ్డి, తేలుకుట్ల శ్రీనివాసరెడ్డి, ఏడుకొండలురెడ్డి, మాదిరెడ్డి రామకృష్ణారెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అన్నె అమర్‌రెడ్డి, పి.చెంచిరెడ్డి, కురిచేడు ఎంపీటీసీలు బుల్లం వెంకట నర్సయ్య, కానాల శివారెడ్డి, జేసీఎస్ కన్వీనరు మేరువ సుబ్బారెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ షేక్ సైదా, బి.గోవిందు, ఎం.యోగిరెడ్డి, సిద్ధి వెంకటరెడ్డి, మోషే, నుసుం ప్రతాపరెడ్డి, వీరగంధం కోటయ్య, కురిచేడు, కల్లూరు సర్పంచ్‌లు కె.కృష్ణయ్య, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి

- ఎన్నికల నియమావళిని అనుసరించి విధులు నిర్వర్తించాలి
- సెబ్ అధికారులకు ఎస్పీ పరమేశ్వరరెడ్డి దిశానిర్దేశం



సమీక్షిస్తున్న ఎస్పీ పరమేశ్వర రెడ్డి, పక్కన ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అధికారులను ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో సెబ్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండి, విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సెబ్ పోలీస్ స్టేషన్లవారీగా పెండింగ్ కేసుల దర్యాప్తులో పురోగతి, నిందితుల అరెస్ట్‌పై ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ మద్యం, బెల్ట్ షాపులు, గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, అమ్మకాలపై, అలాగే పేకాట స్థావరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాల విక్రయంపై ఉక్కుపాదం మోపాలన్నారు. సమాచార, నిఘా వ్యవస్థలను పటిష్టపరుచుకోవాలని చెప్పారు. అక్రమ మద్యం, బెల్ట్ షాపులు, నాటుసారా తయారీ కేసుల్లో పాత నేరస్తులను బైండోవర్ చేయించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్, డీపీఎల్ లిక్కర్ జిల్లాలోకి అక్రమంగా తరలించకుండా సరిహద్దు స్టేషన్లలో నిఘాను పెంచాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ అక్రమాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. బార్ అండ్ రెస్టారెంట్లను తరచూ తనిఖీ చేయాలని, అక్రమంగా మద్యం విక్రయించకుండా అడ్డుకోవాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలించే నగదు, బంగారం, వెండి, అక్రమ మద్యం, ఇతర వస్తువులు తనిఖీల్లో పట్టుబడితే ఫ్లయింగ్ సర్వైలెన్స్ టీంకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, సెబ్ ఒంగోలు ఈఎస్‌తో పాటు జిల్లాలోని సెబ్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



అనుమలవీడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

రాచర్ల: నవరత్నాలతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని మార్కాపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం, సోమిదేవిపల్లె, పాలకవీడు, అనుమలవీడు, గంగంపల్లె, సత్యవోలు, ఒద్దులవాగుపల్లె, రంగారెడ్డిపల్లె గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో కలిసి బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చి స్వాగతం పలికారు. తొలుత రామాపురంలోని సిద్ధభైరవేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, బేధం లేకుండా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు దీవించాలని కోరారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తనతో పాటు ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మేరళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగారెడ్డి, గుడిమెట్ట మాజీ సర్పంచ్ మదిరె చంద్రశేఖర్‌రెడ్డి, సోమిదేవిపల్లె, పాలకవీడు, కాలువపల్లె, సత్యవోలు, ఒద్దులవాగుపల్లె సర్పంచులు రేగలగడ్డ రమాదేవి, పల్నాటి లతీఫ్, మీనిగ నారాయణమ్మ, బాలీశ్వరమ్మ, అన్నపురెడ్డి వెంకట రంగారెడ్డి, సత్యవోలు మాజీ సర్పంచ్ పాలుగుళ్ల రంగస్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకులు సూర స్వామిరంగారెడ్డి, సూర పాండురంగారెడ్డి, బద్దెటి ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచులు ముత్యాల మధు, మదిరె చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ మునాఫ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నుజ్జయిన కారు



మృతుడి (ఫైల్)

నాగులుప్పలపాడు: లారీ, కారు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై బ్రహ్మనాయుడు సమాచారం మేరకు..మద్దిపూడి మండలం గుండ్లసముద్రం గ్రామానికి చెందిన కోవెలకుంట్ల శివకృష్ణ (33) కారులో చీరాల వైపు నుంచి ఒంగోలుకు వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని ఉప్పుగుండూరు సమీపంలోని నాగన్నవాగు వద్దకు వచ్చేసరికి ఒంగోలు నుంచి చీరాల వైపునకు ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద ఘటన అందుకున్న 108 సిబ్బంది వెంటనే బాధితుడిని ఒంగోలు లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శివకృష్ణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై బ్రహ్మనాయుడు ప్రమాదానికి కారణాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య మనీషాతో పాటు 5 ఏళ్ల కుమార్తె తనూజా ఉన్నారు.